ప్రజాశక్తి

బుధవారం 19 ఏప్రిల్ 2023 5

పార్వతీపురం మన్యం



## 21న పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఈనెల 21న స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాబ్‌డ్రైవ్ జరుగుతుందని ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ కోర్సులు (2019 నుంచి 2022) ఉత్తీర్ణులైన 18 నిండి 24 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ మహిళలు ఈ డ్రైవ్‌లో పాల్గొన వచ్చునన్నారు. ఈ డ్రైవ్‌కు యుకోమా కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవచ్చున్నారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ మహిళలు తమ వివరాలను www.apssdc.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో హాజరు కావాలని సూచించారు.




# భానుడు భగ..భగ

## అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు • నిర్మానుష్యంగా మారిన రహదారులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్/సాలూరు

భానుడి భగ భగలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ఎండ వేడికి అల్లాడిపోతున్నారు. వడ గాల్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడి ప్రతాపంతో నగరంలోను, మండల కేంద్రాల్లోనూ రహదారులన్నీ బోసి పోతున్నాయి. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో 43, సాలూరులో 42, వీరఘట్టం35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రధాన రహదారులన్నీ మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారాయి. భానుడు భగ భగమంటున్నాడు. గొడుగు ఉంటేనే బయటికి వచ్చే పరిస్థితి లేదు. ఉదయం 8 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో రహదారు లపైకి వచ్చేందుకు జనం బెంబేలెత్తుతున్నారు. సొంత పనులకు రహదారులపైకి రావాలంటేనే తలపై గొడుగు ఉండాల్సిందే. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.

**సాలూరు:** పట్టణంలో మంగళవారం మిట్టమధ్యాహ్నం పట్టణంలో ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. మధ్యాహ్నం వేళ అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలన్నా నెత్తిన గొడుగు, టోపీ లేకుండా రాలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇళ్లల్లో ఉన్నా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేస్తుండడంతో రాత్రివేళల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు.

### మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

పట్టణంలోని బోసు బొమ్మ జంక్షన్‌లో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా మీ సేవకై మేము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు కూడా మజ్జిగ పంపిణీ చేశారు.



పార్వతీపురంలో గొడుగు వేసుకొని వెళ్తున్న మహిళ



సాలూరులో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

# బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నశించాలని, ప్రధాని మోడీని గద్దె దింపాలని, దేశాన్ని కాపాడాలని సిపిఐ, సిపిఎం ప్రచారభేరి పాలకొండ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో కాద రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ మెయిన్ ఆవరణలో కరపత్రాలు పంపిణీ భాగంగా పోస్టర్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి దావాల రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కేంద్రం ధారాదత్తం చేస్తుందని, ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతుందని విమర్శించారు. కార్మిక చట్టాలు సవరించిందని, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని, కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధానాలు అమలు చేస్తుందని ఈ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు చేయబోయే ఉద్యమాల్లో అన్ని వర్గాలు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్నారు.

**పార్వతీపురం రూరల్ :** దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్న బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం నాయకులు బంటు దాసు పిలుపునిచ్చారు. ప్రచారభేరిలో భాగంగా మండలంలోని బంటువానివలస, కోటవానివలస, గదభవలస, ఎఫ్సిఐ గోడౌన్ వద్ద సిపిఎం సభ్యులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సమావేశాలు, కరపత్రాలు పోస్టర్లు ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని, గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో జరిగే సభలను జయప్రదం చేయాలని కోరారు.

**సీతంపేట:** మండలంలోని కోసంగిలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రచార భేరి నిర్వహించారు. అలాగే రామానగర్, గోలికుప్ప, డబ్బరు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, మండల నాయకులు బి.అప్పారావు, పి.సాంబయ్య, జె.శ్రీరాములు, సర్పంచ్ జె.సుందరమ్మ, భాస్కర్, గంగాధర్, బిడ్డిక అప్పారావు, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు





సీతంపేటలో ప్రచార ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు; పార్వతీపురంలో ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బంటుదాసు



పమావేశంలో మాట్లాడుతున్న పిఒ మీనాకుమారి

# ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. మంగళవారం నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎన్నికల డిటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఫారం-6బి దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తహశీల్దార్ లాగిన్‌లో పెండింగులో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదుకు కృషి చేయాలని సూచించారు.

### అన్ని గ్రామాలకు నెట్ వర్క్ సదుపాయం

ఐటిడిఎ పరిధిలో గల అన్ని గిరిజన గ్రామాలకు నెట్‌వర్క్ సదుపాయం ఉండాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. మంగళవారం బిఎస్ఎన్ఎల్ ప్లానింగ్ డిజిఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలకు పూర్తి స్థాయిలో నెట్ వర్క్ సదుపాయం లేదని, దీన్ని అధిగమించాలని అన్నారు. ఐటిడిఎ పరిధిలో టవర్ల ఏర్పాటు వేగవంతం చేయాలని సూచించారు. 45 టవర్లు మంజూరైనట్లు తెలిపారు. టవర్ల ఏర్పాటులో ఎక్కడైనా స్థలం సమస్య గాని, ఇంకా ఏదైనా సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని అన్నారు. సమావేశంలో నాలుగు మండలాల , ప్లానింగ్ డిజిఎం బివివి నగేష్, ఎపిఒ రోసిరెడ్డి, డీపీవో సతీష్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జెసి ఆనంద్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జాయింట్ కలెక్టర్ ఆనంద్ మంచి సేవా స్ఫూర్తి కలిగిన వ్యక్తి అని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్‌కు మంగళ వారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. జాయింట్ కలెక్టర్ జిల్లా బృందంలో ఒక ముఖ్య సభ్యుడిగా ఉన్నారని చెప్పారు. జిల్లాలో భూసేకరణ, రీసర్వే, ధాన్యం సేకరణలో మంచి పనితీరు కనబరిచారని కొనియాడారు. ధాన్యం సేకరణలో తీసుకున్న చొరవకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రీ సర్వే పూర్తి చేసి 18 వేలు పత్రాలు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం జెసి ఆనంద్ మాట్లాడుతూ పార్వతీపురంలో పనిచేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. జిల్లాలో మంచి బృందం ఉందని ఆయన ప్రశంసించారు. అందరి నుండి మంచి సహకారం లభించింద న్నారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆనంద్ మంచి దృక్పథం కలిగిన వ్యక్తి అన్నారు. వేగవంతమైన పనులకు నిలువుటద్దంగా నిలుస్తారని చెప్పారు. పనితనం, చాకచక్యంలో విశిష్ట శైలి కలిగిన వ్యక్తి అన్నారు. డిఆర్ఒ జె. వెంకట రావు మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులకు భూ సేకరణ, అప్పగింత పనులను త్వరితగతిన చేపట్టారన్నారు. పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ పాలనాపరమైన అనేక అంశాలపై జెసి వద్ద మంచి మార్గదర్శత్వం పొందానన్నారు. ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎం.వి.ఆర్.కృష్ణాజి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, రెవెన్యూ సంఘం సభ్యులు సూర్యనారాయణ, శ్రీరామ మూర్తి, తహశీల్దార్ శివన్నారాయణ, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు నాయుడు ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




జెసి ఆనంద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్‌పి, ఐటిడిఎ పిఒ, సబ్‌కలెక్టర్, అధికారులు

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మురళీమోహన్ రావు, రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై కక్ష సాధింపు, బెదిరింపు, వివక్షతకు పాల్పడుతున్న పార్వతీపురం ఎంఇఒపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మండలంలోని జమదాల యుపి స్కూల్ ఎస్‌జిటి టీచర్ బి.జగన్నాథం మార్చి నెల జీతంలో నాలుగు రోజుల జీతం నోటీసులు ఇవ్వకుండా ఎంఇఒ కట్ చేశారని, ఈ పీరియడ్ వర్కింగ్ పీరియడ్‌గా పరిగణించి ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు వై.శంకర్రావు, గాంధీకి జీతాలు చెల్లించేలా ఎంఇఒకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఎన్.ములగ జెడ్పీహెచ్ స్కూలుకు గణితం అసిస్టెంట్ అవసరం ఉందని, గతంలో పనిచేసిన ఎన్.కిషోర్‌ను పని సర్దుబాటు పేరుతో వేయాలని కోరారు. సాల్ట్, తరల్ ట్రైనింగ్‌కు సంబంధించిన ఉపాధ్యాయులకు రావాల్సిన డబ్బులు విడుదలయ్యాయా, లేదా, అయితే ఏ మండలానికి ఎంత ఇచ్చారు అనేది తెలియపర్చాలని, నిధులు విడుదల కాకపోతే రిలీజ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే విద్యా సంవత్సరంలో పుస్తకాలు ఇండెంట్ ప్రాప్తికి సరఫరా అయ్యేలా చూడాలని, అలాగే ప్రతి పాఠశాల పాయింట్ గానీ, స్కూల్ కాంప్లెక్స్ పాయింట్‌కు కానీ పుస్తకాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాంపెన్సేట్ సెలవులు, ఒహెచ్‌లపై గందరగోళం లేకుండా ముందుగానే స్పష్టంగా నిర్ణయం తీసుకోవాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, ఎంటిఎస్ 98 టీచర్లు జాయిన్ అయినందున పని సర్దుబాటు పేరుతో ఎస్జిటిలో డిప్యూటేషన్ రద్దయ్యి, వెనక్కి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డిఇఒ ఎస్‌డివి రమణ, డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు, విద్యాశాఖ ఏడీలు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించి త్వరగా పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టేషన్లో గల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోమని సూచనలు, సలహాలు చేశారు. ఎస్‌పి వెంట స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

# 23న తాడికొండలో రెడ్ క్రాస్ వైద్య శిబిరం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండలో ఈనెల 23న రెడ్ క్రాస్ సంస్థ ద్వారా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరామ్మూర్తి, కార్యదర్శి బిఎన్‌బి రావు తెలిపారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, రెడ్ క్రాస్ రాష్ట్ర డైరెక్టర్ ఎకె ఫరిడా తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి నిపుణులైన జనరల్ మెడిసిన్ కంటి వైద్య నిపుణులు, చర్మవ్యాధుల నిపుణులు, ఎముకల వైద్యులు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన 100మంది పేద గిరిజన కుటుంబాలకు వంట పాత్రలు, వ్యక్తిగత పరిశుభ్రత సామాగ్రి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గిరిజన రోగులు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# శివారు భూములకు సాగునీరు చేరాలి

## జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

శివారు భూములకు కూడా సాగునీరు అందేలా సాగునీటి కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. గ్రామీణ ఉపాధిహామీ కింద చేపట్టిన సాగునీటి కాలువల అభివృద్ధి పనులపై, ఛైర్‌పర్సన్ తన ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు అందించేందుకు కృషి చేయాలని జెడ్‌పి ఛైర్మన్ కోరారు. తోటపల్లి, గడిగెడ్డ, ఆంధ్ర, తాటిపూడి, తారకరామ తీర్థసాగర్ కాలువ పనుల ప్రగతిని తెలుసుకున్నారు. సాగునీటి కాలువలు ఉన్నచోట, ఈ కాలువ పనులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని, కాలువలు లేనిచోట మేజర్, మైనర్ చెరువు పనులను, ఫీడర్ కెనాల్ పనులను చేపట్టాలని సూచించారు. కాలువలు, చెరువుల్లో జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. పనులు నిర్వహించేందుకు ఇదే తగిన సమయమని, ఈ మూడు నెలల్లోనే అత్యంత వేగంగా పనులు నిర్వహించి పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్, ఉపాధిహామీ అధికారులు కలిసి సమన్వయంతో పనిచేసి, వర్షాలు ప్రారంభమయ్యేలోగా పనులను పూర్తి చేయాలని చెప్పారు. లష్కర్ల గౌరవ వేతనాలను చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, డిపిఒ శ్రీధర్‌రాజా, ఇరిగేషన్ ఇఇ రామచంద్రరావు, డిఎలధో లక్ష్మణరావు, ఉపాధిహామీ ఎపిడిలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పాడైన ప్రధాన పైపులైను

## • మూడు రోజులుగా తాగునీటి సరఫరాకు బ్రేకు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించేందుకు ఈనెల 15న అంబేద్కర్ జంక్షన్ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో రక్షిత మంచి పథకం ప్రధాన పైపులైను దెబ్బ తినడంతో ఈనెల 16 నుంచి కుళాయి పాయింట్ల ద్వారా తాగునీరు సరఫరాకు బ్రేకులుపడ్డాయి. మండల కేంద్రంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 3,553 ఇళ్లకు గానూ దాదాపు 14,119 జనాభా నివాసం ఉంటున్నారు. ఈ రక్షిత మంచినీటి పథకం ద్వారా 70శాతం మంది నీటి కోసం ఆధారపడుతు న్నారు. ఈనెల 16నుంచి తాగునీరు సరఫరా నిలిపి వేయడంతో పట్టణ ప్రజలు గొంతును తడుపుకునేం దుకు గుక్కెడు నీటి కోసం సమీపంలో ఉన్న వట్టిగెడ్డ వద్దకు పరుగులు తీసి చలమల ద్వారా నీళ్లు తోడుకొని తీసుకుంటున్న పరిస్థితి ఏర్పడుతుం దని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన పైపుకు కోసం వీరఘట్టం, పాలకొండ, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం వంటి ప్రాంతాల షాపుల్లో సేకరించినప్పటికీ లభించకపోవడంతో చివరకు విజయవాడలో పైపు లభ్యం కావడంతో అక్కడి నుంచి తెప్పించి ఈనెల 19న అమర్చి మరుసటి రోజు 20 నుంచి గ్రామస్తు లకు తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు 'ప్రజాశక్తి' తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంగళవారం నుంచి రెండు నీళ్ల ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. అయితే ఈ నీటి కోసం మహిళలు క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, మరోవైపు గొంతును తడుపు కునేందుకు ఎండను కూడా లెక్క చేయకుండా మహి ళలు వట్టిగెడ్డకు నీటి కోసం పరుగులు తీస్తున్నారు.





తాగునీటి ట్యాంకురు వద్ద బారులు తీరిన మహిళలు

# ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అధికారి మంగళ వారం సమీక్షించారు. గర్భిణీల వివరాలు పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి గర్భిణీల వసతి గృహాల్లో చేర్చాలని, అక్కడ అన్ని వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మంచి సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. తద్వారా హైరిస్క్ సమస్య తలెత్తే అవకాశాలు ఉండవని అన్నారు. రక్త హీనత పరీక్షలు అందరికీ నిర్వహించి తగిన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంపూర్ణ పోషణ కిట్లు విధిగా అందాలని వాటిపై స్పష్టమైన పర్యవేక్షణ ఉండాలని ఆయన తెలిపారు. తల్లి పిల్లల ఆధార్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాలను సంబంధిత పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఇమ్యునైజేషన్ ప్రతి ఒక్కరికీ జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఇమ్యునైజేషన్ చేయడంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని ఆయన పేర్కొన్నారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి జీవన విధానంలో చిన్న మార్పులు వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. స్ప్రేయింగ్ కార్యక్రమం పక్కాగా జరగాలని ఆయన ఆదేశించారు. ఫీడర్ అంబులెన్సులు, 104, 108, 102 వాహనాల అందుబాటు, సేవలు సంతృప్తికరంగా ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది అందరూ విధిగా బయో మెట్రిక్ హాజరు వేయాలని, నివేదికలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డా.ధవళ భాస్కరరావు, ఇన్‌ఛార్జ్ డెప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ డివి రమణ, ప్రోగ్రాం అధికారి డా. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్



విద్యార్థుల విద్యాపరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న పిఒ కల్పనాకుమారి

## జిపిఎస్ పాఠశాలను పరిశీలించిన పిఒ

**సీతంపేట :** మండలంలోని పెదరామ పంచాయతీ మొగదరగూడ జిపిఎస్ పాఠశాలను మంగళవారం ఐటిడిఎ పిఒ కల్పన కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థుల విద్యా పరిజ్ఞానాన్ని పరీక్షించారు. అలాగే గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థుల సంఖ్యకు, వండిన భోజనానికి ఎందుకు వ్యత్యాసం ఉందని ప్రశ్నించారు. కేంద్రంలో విద్యుత్ లైట్లు వెలగకపోవడం, ఫ్యాన్ పనిచేయకపోవడంపై గ్రామ కార్యదర్శి లైట్, ఫ్యాన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం మొగదరగూడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు పిఒ కోరగా వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇని ఆదేశించారు. అలాగే హౌసింగ్ బిల్లులు మంజూరు కాలేదని పిఒ దృష్టికి తీసుకురాగా, పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. మొగదారగూడ నుంచి రామన్నగూడ రోడ్డు మధ్యలో సిసి రోడ్లు వేయాలని కోరారు. జెపి దీసరిగూడ నుంచి జాతాపు జగతిపల్లికి రోడ్డు నిర్మించాలని కోరారు. దేవనాపురం పంచాయతీలోని రామన్నగూడ, మజ్జిగూడ గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇని ఆదేశించారు. పిఒ వెంట ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

## 'ఉపాధి' పనుల పరిశీలన

**సీతానగరం :** మండలంలోని జోగింపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనిలోనే ఉండాలని, ప్రభుత్వ నిర్ణయించిన పనులు చేయాలని, ఎండాకాలం కావున వేగంగా పనిలోకి వచ్చి వడదెబ్బకు గురికాకుండా పనులు ముగించుకొని వెళ్లాలని అన్నారు. అప్పుడే ఉపాధి కూలీలకు ప్రభుత్వ నిర్ణయించిన కూలి వస్తుందన్నారు. ఉపాధి కూలీలు మస్తర్లను పరిశీలించారు. ఆయనతో పాటు ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రజ్ఞ

## జి.శివడలో వైద్య శిబిరం

**కురుపాం :** మండలంలోని జి.శివడలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ 58మందికి వైద్య సేవలు నిర్వహించారు. బాలింతలకు, పక్షవాతంతో బాధపడిన వాళ్ళ ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతిగృహ సంరక్షణ అధికారి బి.భానుమూర్తి, ఎంఎల్‌హెచ్ పి.మహేశ్వరీ హెల్త్ సూపర్ వైజర్ నాగేశ్వరావు, హెల్త్ విజిటర్ పి.భారతి, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఎఎన్ఎం ఎ.సుఖవాసి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైస్ ఎంపిపిని సన్మానిస్తున్న డిఎస్‌సి 98 ఉపాధ్యాయులు

## వైస్ ఎంపిపిని కలిసిన 98 డిఎస్‌సి టీచర్లు

**సాలూరు:** ఇటీవల మండలంలో నియామకమైన 1998 డిఎస్సీ టీచర్లు మంగళవారం వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. తమ నియామకానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకులకు కొత్త టీచర్లు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

## సచివాలయంలో డిఎల్‌డిఒ తనిఖీలు

**పాలకొండ:** మండలంలోని అంపిలి గ్రామ సచివాలయాన్ని మంగళవారం డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ సందర్శించారు. ప్రజలకు సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందడం లేదు అని అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు ఏకరూప దుస్తులు ధరించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఉద్యోగుల పని తీరు మెరుగుపరచుకోవాలన్నారు. ఈయన వెంట వైస్ ఎంపిపి వాకముడి అనిల్, సర్పంచ్ లోలుగు విశ్వేశ్వర రావు ఉన్నారు.

## 66 కిలోల గంజాయి పట్టివేత

**విజయనగరం :** స్థానిక రైల్వే స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద నాలుగు బ్యాగులతో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసుల అరెస్టు చేశారు. అతని నుంచి 66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ సిఐ వెంకటరావు తెలిపారు. అనుమానాస్పదంగా నాలుగు బ్యాగులతో ఒక వ్యక్తి తిరుగుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐలు భాస్కరరావు, అశోక్ కుమార్ తనిఖీ చేసి పట్టుకున్నారు.

# మన్యంలో దాహం కేకలు

- అడుగంటిన బావులు, బోర్లు
- ఊట బావులు, గెడ్డలపైనే ఆధారపడుతున్న గిరిజనులు

**ప్రజాశక్తి - సీతంపేట**

సీతంపేట ఏజెన్సీలో వేసవి ప్రారంభంలోనే దాహం కేకలు మొదలయ్యాయి. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బావిలో నీరు అందడం లేదు. దీంతో మోటర్లు మొరయిస్తున్నాయి. గిరిజన తండాలో కొండ శివారు ప్రాంతంలో ఉండడంతో బోర్లు ఎంత కొట్టిన నీరు పడడం లేదు. దీంతో ఏమి చేయలేక గిరిజనులు ఊట బావులు, గెడ్డలపై ఆధారపడుతున్నారు. అవి ఇంకిపోవడంతో గుక్కెడు నీళ్ల కోసం తహతహలాడుతున్నారు. ఇటీవల కాలంలో కొద్దిపాటి వర్షాలు పడటంతో గెడ్డల్లో కాస్త చెమ్మ కనిపిస్తుంది. ఇప్పటికే తాగునీటి సమస్య పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో వినతులు సమర్పిస్తున్నారు. అధికారులు తాగునీటి సమస్య పరిష్కారంలో ముందస్తుగా ప్రణాళికలు రూపొందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలో అధికారిక లెక్కల ప్రకారం 704 బోర్లు, 401 బావులు, 160 సోలార్ పథకాలు ఉన్నాయి. వీటిలో ఐదు, పది తప్ప మిగిలినవన్నీ పనిచేస్తున్నాయని అధికారులు చెప్పుకొస్తున్నారు. అయితే అధికారుల మాటలకు వాస్తవ పరిస్థితికి పూర్తిగా భిన్నంగా ఉంది. మండలంలో సోమగండి పంచాయతీ గొయ్యిగూడలో40 కుటుంబాలు ఉన్నాయి. బోర్లు లేవు ఉన్న ఒక బావి అడుగంటికి పోయింది. నీరు తోడినప్పటికీ బురద నీరు వస్తుంది. రక్షిత పథకం ఉన్నప్పటికీ మోటర్ మోరాయించింది. జోగినాయుడు గెడ్డ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు వస్తున్నప్పటికీ తక్కువ వస్తుంది. మేలో అది కూడా రాదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అలాగే నాయుడుగూడ పంచాయతీ జోనగదొండమామిడిగూడలో 16 కుటుంబాలు



పాండ్రలో అడుగంటిన బావి

నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో ఉన్న ఒక బోరు కూడా పనిచేయడంలేదు. సోలార్ మోటార్ ఉన్నప్పటికీ నీరు అందడం లేదు. నీరు కావాలంటే కొంత సమయం వేచి ఉండాలి. దీంతో ఆ మినీ ట్యాంక్ నిండాలంటే ఎక్కువ సమయం పడుతుంది. కొండాడ పంచాయతీ ఎగువబెనరాయి ఇప్పమానగూడలో 15 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బోరుబావిల్లేకపోవడంతో ఊటబావి నుంచి పైప్లైన్ ద్వారా ట్యాంకు నీరు వస్తుంది. అక్కడ వేసవి తీవ్రత ఎక్కువ ఉండటంతో ఒక్కొక్కసారి నీరు రావడం లేదు. నీరు రాని సమయంలో అర కిలోమీటర్ దూరంలో ఉన్న గెడ్డలో ఉన్న బురద నీరే తాగాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పాండ్ర అక్కన్నగూడలో 16 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడి బావి అడుగంటి పోయింది. దీంతో చాలీచాలని నీరు వస్తుంది. ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న బాపన్నగూడగెడ్డ నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. పాండ్ర మల్లయ్యగూడ 12 కుటుంబాలు ఉన్నాయి. బోరు బావుల్లేకపోవడంతో ఊటబావిపై ఆధారపడి ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఊట బావి ఇంకిపోతే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలా చెప్పుకుంటే అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతుంది. కావున ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజనులు కోరుతున్నారు.



గొయ్యిగూడలో నీరు ఇవ్వని రక్షిత పథకం

### నీరు తక్కువ వస్తుంది

రక్షిత మంచినీటి పథకం మోటర్ మరమ్మతులకు గురైంది. జోగి నాయుడుగూడగెడ్డ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు వస్తున్నా అది చాలడం లేదు. మేలో అది కూడా రాదు. తాగునీటి సమస్య పరిష్కరించాలి.

**సవర డుంబయ్య,**
**గిరిజనుడు, గొయ్యిగూడ.**

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బోర్లు మరమ్మతులు చేయించాం. నీటి ఎద్దడి గ్రామాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొని వెళ్లాం.

**పవన్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ**

## గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాశక్తి - సీతంపేట**

ఐటిడిఎ పరిధిలో గల గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి అన్నారు. మంగళవారం గిరిజన సంఘ నాయకులతో పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో 1/70 యాక్ట్, ఎల్‌టిఆర్ చట్టాలు అమలు చేయాలని అన్నారు. అలాగే అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేయాలని, పీసా చట్టం అమలు, గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఏనుగుల సమస్యలను పరిష్కరించాలని, కొత్త పంచాయతీల సరిహద్దులపై సర్వే చేపట్టాలని కోరారు. వైటీసీల్లో శిక్షణలు కొనసాగించాలన్నారు. కొత్తగా జిసిసి డిపోలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సంధర్భంగా పలువురు గిరిజన సంఘ నాయకులు మాట్లాడారు. సమావేశంలో చెప్పిన అన్ని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి ఆదినారాయణ, జడ్పిటీసీ ప్రతినిధి రాము, గిరిజన సంఘ నాయకులు తేజేశ్వరరావు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ మీనాకుమారి, ఎమ్మెల్యే కళావతి

### పిఒను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

స్థానిక ఐటిడిఎ పిఒ కల్పనా కుమారిని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి గిరిజన సమస్యలను వివరించారు. గిరిజన గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. గిరిజన సంఘాల తరుపున బిడ్డిక తేజేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం గిరిజన ప్రజా ప్రతినిధులు, నాయకులు, గిరిజన సంఘాల పెద్దలతో జరిగిన పరిచయ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

### మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**రాజాం:** విద్యార్థులు నైపుణ్యం సాధించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, తద్వారా ఇతరులకు ఉపాధి కల్పించాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. రాజాంలోని జిఎంఆర్‌విఎఫ్ క్యాంపస్‌లో నాబార్డు మద్దతుతో కూడిన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని సందర్శించారు. రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ కోర్సులో శిక్షణ పొందిన వారితో సంభాషించారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, జీవనోపాధి, ఉపాధిని కనుగొనడంలో దోహదపడుతుందని ఆయన సూచించారు. నాబార్డు డిడిఎం టి.నాగార్జున వ్యవసాయం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరియు స్వయం సహాయక సంఘాలలో నాబార్డు అభివృద్ధి పనుల గురించి వివరించారు.

## ఓపెన్ స్కూల్ ప్రాక్టికల్ పరీక్షకు 30 మంది విద్యార్థులు హాజరు

**కురుపాం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించినటువంటి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షకు 52మంది విద్యార్థులకు గానూ 30మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫిజిక్స్ పరీక్ష నిర్వహించామని,22 మంది విద్యార్థులు పరీక్షకు గైరాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి అన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి - సీతానగరం**

మండలంలోని బగ్గందొరవలసలో సర్పంచ్ ఎ.నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రతను బట్టి గ్రామ ప్రజలకు, ప్రయాణికులకు అనువుగా తాగునీరందించే లక్ష్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఈ చలివేంద్రాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు

## రౌడీషీటర్ దారుణహత్య



**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

నగరంలోని కాట వీధికి చెందిన రౌడీ షీటర్ షేక్ అలీజాన్ (33) దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని అపహరించి విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం, చిన్నాపురం సమీపంలో ఒక ప్రైవేట్ లే అవుట్లో పెట్రోల్ పోసి తగలబెట్టేసిన ఘటన మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం..

ఈనెల 15 నగరంలోని దాసన్నపేట రింగురోడ్డు సమీపంలో గల బాబు రెస్టారెంట్ అండ్ బార్‌లో అలీజాన్, లక్ష్మణరావుతో పాటు మరికొంతమంది మద్యం తాగేందుకు వెళ్లారు. అరువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చేది లేదని బార్ నిర్వాహకులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో అలీజాన్‌తో పాటు వచ్చిన లక్ష్మణరావు అనే వ్యక్తి గాయపడగా, బార్‌లో పనిచేస్తున్న వెయిటర్ సూరిబాబు కూడా గాయపడ్డాడు. లక్ష్మణరావును గాయపర్చినందుకు డబ్బులు ఇవ్వాలని అలీజాన్ సెటిల్‌మెంట్‌కు దిగాడు. దీంతో ఇరువర్గాల మధ్య మళ్లీ ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆలీజాన్ బార్ సూపర్‌వైజర్ శివప్రసాద్ ఇంటికి వెళ్లి మారణ ఆయుధాలతో దాడి చేస్తుండగా, శివప్రసాద్ భార్య అడ్డుకోగా, ఆమెను కారులో ఎక్కించుకొని వెళ్లిపోయారు. ఇంతలో సమాచారం తెలుసుకున్న శివప్రసాద్ తోడల్లుడు జి.సన్యాసినాయుడు వెంబడించడంతో ఎల్లమ్మతల్లి గుడి వద్ద వదిలేశారు. బాధితుడు శివప్రసాద్ సోమవారం ఒకటో పట్టణ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పదే పదే బార్‌కు వచ్చి ఘర్షణ పడడం, చంపేస్తానని బెదిరించడంతో ఆత్మరక్షణ కోసం చంపేశారని నిందితులు ఒప్పుకున్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న తోటపల్లి ఆధునీకరణ సాధన కమిటీ సభ్యులు

## కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ప్రజాశక్తి - వీరఘట్టం**

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనుల్లో న్యాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షణ కూడా ఉండాలని తోటపల్లి ఆధునీకరణ సాధన సమితి అధ్యక్షులు చేబోతుల లక్ష్మీనారాయణ, బి.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కత్తులకవిటి సమీపంలో చేపడుతున్న తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. రానున్న ఖరీఫ్ నాటికి కాలువ పనులు పూర్తి చేస్తామని అధికారులు ప్రకటన చేశారని, ప్రస్తుతం జరుగుతున్న పనులు చూస్తే మందకొడిగా సాగుతున్నాయని విమర్శించారు. గత ఏడాది రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గుర్తు చేశారు. ఎన్నో ఏళ్ల ఫలితంగా ఆధునీకరణ పనులు సాధించుకున్నామని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డిమాండ్ చేశారు.

## వజ్జయిగూడలో గడపగడపకు మన ప్రభుత్వం

**సీతంపేట:** మండలంలోని వజ్జయిగూడ సచివాలయం పరిధిలోని వజ్జయిగూడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అరకు ఎంపి జి.మాధవి, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే వారు గ్రామసచివాలయ వ్యవస్థ, వాలంటీర్ ద్వారా పథకాలను పొందవచ్చునన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఎంపిపి బి.ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, ఎఎంసి చైర్మన్, మోహన్‌రావు ఎంపిటిసిలు, సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు రాము చంద్రశేఖర్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పెదమేరంగిలో 'జగనన్న నువ్వే మా నమ్మకం'

**జియ్యమ్మవలస :** మండలంలోని పెదమేరంగిలో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం పంచాయతీ సర్పంచ్ అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న పథకాలు వివరిస్తూ వారి మద్దతును కోరారు. కార్యక్రమంలో పోల వెంకటరత్నం, దేవకోట తిరుపతిరావు, మరడాన కిషోర్, తదితరులు పాల్గొన్నారు



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

## వైసిపి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి చేసిన కుటిల ప్రయత్నాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడంతో దిక్కుతోచని స్థితిలో ఆ పార్టీ నాయకులు ఉన్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మండలంలోని కవిటిభద్రలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పల్లెల నుంచి ప్రజలు పట్టణానికి వచ్చినప్పుడు వారి ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లను తొలగించి గ్రామీణ ప్రాంతాల ప్రజల కడుపు మాడ్చారని అన్నారు. తాతల నుండి సంక్రమించిన భూ పట్టాలపై జగన్ ఫోటోలను ముద్రించడం భూముల్లో ఆయన పేరున ఉన్న సర్వే రాళ్లను పాతించడం వంటి పనులతో గ్రామీణ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. అంతేకాక వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి భవిష్యత్తులో వారికి ఉచిత విద్యుత్తు లేకుండా చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వీటితో పాటు పింక్ డైమండ్, కోడి కత్తి, బాబాయి హత్యలను టిడిపికి అంటగట్టడం, అవి పూర్తిగా అబద్ధమని తేలిపోయాయని అన్నారు. సిఎం విధానాలతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికలు ఎప్పుడొచ్చినా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం విధానాలను వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డి మోహన్ రావు, నాయకులు బొంగు పాండురంగ విఠల్, గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, బేత లక్ష్మణరావు, బేత మధుసూదనరావు, శ్రీధర్, పాల్గొన్నారు.

## రామకృష్ణారావు మృతికి సంతాపం

**ప్రజాశక్తి -పార్వతీపురం**

ఆకాశవాణి, దూరదర్శన్ విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ కేంద్రాల డైరెక్టర్‌గా పని చేసిన అధికారి, జర్నలిస్ట్ రామకృష్ణారావు మృతి పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలో రామకృష్ణారావు మృతి చెందారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఆయన పేర్కొంటూ విచారం వ్యక్తం చేశారు. ఎక్కువ కాలం ఆకాశవాణి, దూరదర్శన్ వార్తా విభాగం ఇంచార్జ్‌గా పనిచేసి, జర్నలిస్టులతో సత్సంబంధాలు నెరపేవారని, ఎంతో ఆత్మీయత కనబరిచేవారని సత్యారావు మంగళ వారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, ఇతర వీవీఐపీల పర్యటనల సందర్భంగా ఆయన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో మంచి సుపరిచయాలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. రామకృష్ణారావు ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సత్యా రావు తెలిపారు.

## బోర్లకు మరమ్మతులు

**ప్రజాశక్తి - కురుపాం**

మండలంలో క్రాస్ పోగ్రాం జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నీలకంఠాపురలో బోర్ మెకానికులు పాడైన బోర్లకు మరమ్మ తులు చేపట్టారు. స్థానిక సర్పంచ్ ఎ.మన్మథరావు సమక్షంలో పంచా యతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో పాడైన బోర్లను మరమ్మ తులు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలె వరూ తాగునీటి సమస్యతో బాధపడ కుండా ఉండాలనే ఉద్దేశంతో దగ్గరుం డి ప్రతి గ్రామంలో పాడై బోర్లను మరమ్మతులు చేయిస్తున్నానని తెలి పారు. ఇంకా ఎక్కడైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే మరమ్మతులు చేయించి గ్రామస్తులకు తాగునీటి సదుపాయం కల్పిస్తానని తెలిపారు.

బోరు పనులను చేయిస్తున్న సర్పంచ్ మన్మథరావు



## మున్సిపాలిటీ పాలనను గాడిలో పెట్టండి

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

మున్సిపాలిటీ పాలన గాడిలో పెట్టాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు వినతిని ఇచ్చేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా, కమిషనర్, మేనేజర్, చైర్‌పర్సన్ ఎవరూ లేకపోవడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ కీర్తిశేషులు తురుమళ్ల రామ్మూర్తి విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పాలన గాడి తప్పిందని ఆరోపించారు. వర్షా కాలంలోనే కాకుండా, వేసవిలోనూ కుళాయిల్లో బురద నీరు సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. అలాగే నాలుగో వార్డులోని వివేకానంద కాలనీలో ఉజ్జిడి తల్లి, దేశమ్మ తల్లి వీధుల్లో మురుగు కాలువల్లో గత కొంతకాలంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పట్టణాన్ని వేధిస్తున్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్యతో పాటు ఏమాత్రం వర్షం పడ్డా మెయిన్ రోడ్‌లో కాలువలు సక్రమంగా లేక నిల్వ ఉండే నీరు ప్రవహించేందుకు కాలువలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. వరహాలుగెడ్డలో పూడికతీత పనులు చేపట్టాలని, వివేకానంద కాలనీ ఎదురుగా రాయగడ రోడ్డులో తాగునీటి పైపుకు లీకులు ఏర్పడి పెద్ద గొయ్యి ఏర్పడిందని, దాన్ని పూడ్చాలని పలుమార్లు స్థానికులు కోరినా మున్సిపల్ అధికారులు స్పందించలేదన్నారు. సంబంధిత మున్సిపల్ యంత్రాంగానికి మంచి బుద్ధిని ప్రసాదించి ప్రజలకు చక్కని పాలన అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాలినాయుడు, రాజాన రాంబాబు, మండల శరత్ కుమార్, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, తెర్లి సంతు, వై. నవీన్, టీ. వంశీ, రైతు బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాశక్తి - భామిని**

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 23న స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో నిర్వహిస్తున్నామని, ఈ ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల గురుకుల సమన్వయ కర్త బి.చంద్రావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుండి 12గంటల వరకు 5వ తరగతిలో ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు జూనియర్ ఇంటర్ ప్రవేశానికి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను అంతర్జాలంలో డౌన్‌లోడ్ చేసుకోవాలని పరీక్షకు వచ్చే వారు ఎగ్జామ్స్ పాడ్, హాల్ టికెట్, బ్లూ ఆర్ బ్లాక్ పెన్ తీసుకొని రావలెను అని తెలియజేసారు.